ప్రజాశక్తి

మంగళవారం 13 జూన్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా



ఫిట్ 'లెస్'!

- రోడ్డెక్కిన స్కూల్ బస్సులు
- కృష్ణాలో పాఠశాలలు, కళాశాలల బస్సుల సంఖ్య 702
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేనివి 209
- రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. కొందరు విద్యార్థులు పాఠశాలలకు స్కూల్ బస్సుల్లో వెళ్తున్నారు. స్కూల్ బస్సుల్లో చాలా వాటికి ఫిట్‌నెస్ ఫరీక్షలు నిర్వహించకుండానే రొడ్డెక్కించారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్ధకంగా మారింది. ఈ పరిస్థితుల్లోనే రవాణాశాఖ దృష్టి సారించింది. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. క్లచ్, బ్రేక్‌లు, గేర్‌లు, టైర్లు, చాయిస్, బాడీ అన్నీ సక్రమంగా ఉన్న వాహనాల్లో ప్రయాణం ఒకింత సురక్షితం. ఈ నేపథ్యంలోనే విద్యార్ధులను సురక్షితంగా ప్రయాణించేందుకు అనుగుణంగా ప్రయివేటు విద్యా సంస్థల బస్సులకు వేసవి సెలవులకు ముందే ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి తీసుకెళ్లి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చిన బస్సులను మాత్రమే వినియోగించాలి. వీటిలో మాత్రమే విద్యార్ధులను పాఠశాలలకు తీసుకెళ్ళి తీసుకురావాలి. అయితే రవాణాశాఖ నుంచి ఫిట్‌నెస్ తీసుకోకుండానే కొన్ని పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా బస్సులను రోడ్డెక్కించాయి. ఒక్కో విద్యార్థి నుంచి వేలాది రూపాయలు ఫీజులు తీసుకుని ఫిట్‌లెస్ బస్సుల్లోనే పాఠశాలలకు, ఇళ్లకు విద్యార్ధులను చేరవేస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని బస్సుల్లో ప్రయాణం ప్రమాదకరమని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

కరోనాకు తర్వాత కొన్ని చిన్న ప్రయివేటు విద్యా సంస్థలు మూత పడ్డాయి. మరికొన్ని విద్యా సంస్థలు బస్సు సర్వీసు తగ్గించాయి. లంకపల్లిలో ఇంజనీరింగ్‌కాలేజీ మూతపడగా, 38 బస్సులు నడిపిన మచిలీపట్నం ప్రాంతంలోని మరో ఇంజనీరింగ్ కాలేజీ ప్రస్తుతం 17 బస్సులను నడపడానికి మాత్రమే పరిమితం అయింది. ఒకప్పుడు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న పాఠశాల బస్సులు సంఖ్య వందల్లోకి వచ్చింది. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు జిల్లా వ్యాప్తంగా 702 బస్సులను నడుపుతున్నాయి. 493 స్కూల్ బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను పాఠశాలల యాజమాన్యాలు తీసుకున్నాయి. 209 స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండానే తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులు స్కూల్ బస్సుల తనిఖీలకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సర్టిఫికెట్ లేకుండా రోడ్డెక్కిన బస్సులపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

ఫిట్‌నెస్‌లేని బస్సులు నడిపితే పాఠశాల యాజమాన్యాలపై చర్యలు

సీతాపతిరావు, జిల్లా రవాణాశాఖాధికారి

ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు స్కూల్ బస్సులు నడపకూడదు, పాఠశాలలు తెరవడంతో విద్యా సంస్థల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపైకి వస్తే వాటిని స్వాధీనం చేసుకుంటాం. సరైన పత్రాలు లేని బస్సులను సీజ్ చేస్తాం. సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయానికి వెళ్తున్న రక్షణ యాత్ర

కౌలు రైతు రక్షణ జాతాలు విజయవంతం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

కౌలు రైతు చట్టాన్ని మార్చాలనీ, సిసిఆర్‌సికి భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలని డిమాండ్‌చేస్తూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతుల రక్షణ యాత్ర జీపు జాతాలు సోమవారంతో విజయవంతంగా ముగిశాయి. ఈనెల ఐదోతేదీన అనకాపల్లి జిల్లా నుంచి ఒక జాతా, ఏడోతేదీన నెల్లూరు జిల్లానుంచి మరో జాతా ప్రారంభమైన విషయం తెలిసింతే. ఈ రెండు అనకాపల్లి నుంచి ప్రారంభమైన జాతా, నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన జాతాలు కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించాయి. ఈ రెండు జాతాలు తోట్లవల్లూరు చేరుకున్న సందర్భంగా తోట్లవల్లూరులో శనివారం సాయంత్రం పాదయాత్ర జరిగింది. సెంటర్‌లో యాత్రను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం ఉదయం విజయవాడ ప్రకాశం బ్యారేజీ సీతమ్మ వారి పాదాల నుంచి మొదలైన ఈ పాదయాత్ర ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా 500 మంది రైతులు కౌలు రైతులతో సిసిఎల్ ఆఫీసు మంగళగిరికి చేరుకుని అధికారులకు వినతులతో కూడిన పత్రాన్ని అందించారు. వినతిపత్రంలోని నిబంధనలు ప్రభుత్వానికి నివేదిక ద్వారా పంపిస్తామని,న్యాయం చేస్తామని కౌలు రైతు సంఘాల ప్రతినిధులకు అధికారులు హామీ ఇచ్చారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు,కౌల్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పి.రంగారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. శివ నాగేంద్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా (మిగతా 6లో)

జలగండం

నీట మునిగి ముగ్గురు మృతి

ప్రజాశక్తి కంచికచర్ల, నందిగామ, పెనుగంచిప్రోలు

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలో సోమవారం నాడు నీట మునిగి ముగ్గురు మృతిచెందారు. ప్రమాదవశాత్తూ కీసర మున్నేటిలో మునిగి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు నందిగామ ముక్కపాటి నగర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు బట్టలు ఉతికేందుకు సోమవారం ఉదయం మండలంలోని కీసర మునేటి వద్దకు వచ్చారు. వీరిలో కరుణాకర్ అనే వ్యక్తి మునేటిలోకి దిగి బట్టలు ఉతుకుతున్న క్రమంలో లోతు తెలియక నీటిలో మునిగి కాపాడమని అరవడంతో అందుగుల కిషోర్ (26) అనే వ్యక్తి నీటిలోకి దిగి కరుణాకర్ ఒడ్డుకు చేరేందుకు సహకరించాడు. కానీ కరుణాకర్‌తో పాటు ఒడ్డుకు చేరడంలో కిషోర్ విఫలమై నీట మునిగి మత్యువాత పడ్డాడు. స్థానికుల సహాయంతో నీట మునిగిన కిషోర్‌ను కాపాడి ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే కిషోర్ మతి చెందినట్లు ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. మతుడు కిషోర్‌కు మూడేళ్ల క్రితం వివాహం కాగా సంతానం కలగలేదు. కిషోర్ మరణంతో ముక్కపాటి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అందుగుల కిషోర్

పెంబుల రణదేవ్

పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ సమీపంలో మున్నేరులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళ్తే తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి (మిగతా 6లో)

గూడూరులో కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి రమేష్, విజయవాడలో కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కలెక్టర్ డిల్లీరావు

విద్యా రంగం అభివృద్ధికి కృషి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-గూడూరు, కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ

జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా గూడూరులో మంత్రి జోగి రమేష్, విజయవాడలోని సత్యానారాయణపురంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ డిల్లీరావు విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. గూడూరు మండలం మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిట్లను అందజేసిన అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో సిఎం వైఎస్ జగన్ నాడు-నేడు పథకం కింద సకల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు అందజేసి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రతిరోజూ పోషకాహారం కలిగిన మెనూతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే తెలుగు ఇంగ్లీష్ తో కూడిన ద్విభాష పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్, షూస్, బెల్టు వంటి పది రకాలైన మెటీరియల్ అందించడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1,07,029 మందికి విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. మచిలీపట్నం పోర్టు పనులు రెండేళ్లలో పూర్తికానున్నాయన్నారు. వచ్చే నెల నుండి మచిలీపట్నం వైద్య కళాశాలలో 150 మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాలు పొందనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ ఏడాది మల్లవోలు హైస్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన (మిగతా 6లో)

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో శ్రీ మార్కండేశ్వర స్వామి వారి దేవాలయ వీధిలో గత 40 రోజులుగా వేసవి కాలం సందర్భంగా అక్షర ప్రగతి ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ వేసవి విజ్ఞాన శిబిరం ఉచిత శిక్షణ తరగతులు ముగింపు సభలో టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల పాడ్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఎవరైనా అత్యంత ప్రతిభాశీలులుగా, ప్రభావ వంతులుగా చేయగలిగిన శక్తి విద్యకు మాత్రమే ఉన్నదని, విద్యార్థులు చదువులపట్ల అత్యంత శ్రద్ధ వహించటం ద్వారా ఉన్నతమైన స్థానాలకు ఎదగవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు లిటిలేంజిల్స్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పరీక్షల ప్యాడ్స్ వితరణగా అందజేసిన యాపిల్ శ్రీనివాస్, ఫౌండేషన్ ఆర్గనైజర్లు రచ్చా శ్రీను, గోసిక శ్రీను, గంజి కొండలు, ప్రవచన పాంచజన్య డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

- రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు, ట్రాక్టర్ బావిలో పడి దుర్మరణం

బోల్తా పడ్డ బులెరో వాహనం

కావ్య

దుర్గాప్రసాద్

శ్రీకాంత్

ప్రజాశక్తి-మైలవరం : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన 22 మంది బొలెరో వాహనంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలోని గుబ్బల మంగమ్మ ఆలయానికి బయలుదేరారు. జి. కొండూరులోని శివ సాయి హెూటల్ సమీపంలో జాతీయ రహదారి వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కావ్య (18) వేములకొండ జీవన దుర్గాప్రసాద్ (20)అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గాయపడ్డ వారిని విజయవాడలోని హాస్పిటలకు తరలించారు. మరో ఘటనలో జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామానికి చెందిన పటాపంచల శ్రీకాంత్ (20) కొండపల్లిలోని ఆయిల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం వి.టి.పి.ఎస్ లో జరుగుతున్న క్రైస్తవ కూటములకు వెళ్ళాడు.అనంతరం తిరుగుప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా జి.కొండూరు వై జంక్షన్ వద్ద అర్ధరాత్రి సమయంలో మైలవరం నుండి ఇబ్రహీంపట్నం వెళుతున్న లారీ ఢీకొంది.ఈ ఘటనలు శ్రీకాంత్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మూడు మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జి.కొండూరు ఎస్సై ధర్మరాజు తెలిపారు.

ట్రాక్టర్ బావిలో పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలోని దాచవరం గ్రామంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ వ్యవసాయ బావిలో పడి దాచవరం గ్రామానికి చెందిన బంక రాజేష్ దుర్మరణం పాలయ్యాడు. సేకరించిన సమాచారం ప్రకారం మండలం లోని దాచారం గ్రామంలో తోట హరీష్ పొలంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ డ్రైవర్ పల్లె కంటి ప్రవీణ్ తో బంక రాజేష్ (16) వెళ్ళాడు. ట్రాక్టర్ డ్రైవర్ అల్పాహారం తీసుకోవడం కోసం పొలంలో ట్రాక్టర్ ఆపి పొలం గట్టు వైపుకి వెళ్ళాడు. అదే ట్రాక్టర్ పై ఉన్న రాజేష్ సరదాగా ట్రాక్టర్లు నడుపుదాం అని ప్రయత్నం చేయగా అదుపుతప్పి సమీపాల బావిలో దూసుకెళ్లింది. ట్రాక్టర్ తో పాటు రాజేష్ కూడా బావిలో పడి దుర్మరణం పాలయ్యాడు. ఈ విషయం గ్రామస్తులకు సమాచారం తెలపడం గ్రామస్తులు ఆదివారం రాత్రి బావిలో పడ్డ ట్రాక్టర్లు రాజేష్ ను జెసిబి సాయంతో బయటకు తీశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పది సంవత్సరాల క్రితం రాజేష్ తండ్రి మతి చెందారు. తల్లి తమ్ముడుతో కలిసి కూలీ పని చేస్తూ జీవనం సాగించే కొడుకు మృతితో తల్లి రోదన కంటి తడి పెట్టించింది. మతదేవాన్ని పోలీసులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి తరలించి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటిఎంలో చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఎస్బిఐ ఎటిఎంలో దొంగలు బీభత్సం చేశారు. ఆదివారం రాత్రి స్థానిక పాత బస్టాండ్ లోని అశోక్ నగర్ ప్రాంతంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న ఎటిఎం లో చోరి చేసేందుకు విఫలప్రయత్నం చేశారు. గ్యాస్ కట్టర్లతో ఎటిఎం వైర్లు కట్ చేస్తుండగా ఎసి కంప్రెషన్లు పేలడంతో మంటలు వ్యాపించడంతో దొంగలు పరారి అయినట్లు సమాచారం. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని విచారణ చేశారు. ఈ ఎటిఎం కు చుట్టు పక్కల ఏమైనా సిసి కెమెరాలు ఉన్నాయా, ఉంటే వాటిని నుంచి ఫుటేజ్ సేకరించేందుకు క్లూస్ టీం విచారణ జరుపుతున్నారు. తమిళనాడు చెందిన దొంగల ముఠా కావచ్చు అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

నందిగామలో...

మైలవరంలో...

కంచికచర్లలో..

ప్రజాశక్తి -నందిగామ : కార్పోరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక విద్యార్థించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కషి చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ స్కూళ్ళ ప్రభుత్వ బడులతో పోటీపడేలా మన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ వారి చదువుల భారాన్ని వైయస్ జగన్ తన భుజాలకెత్తుకున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్ లు, మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, రెండు జతలు సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్, డిక్షనరీ లను బడులు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు అందజేయడం చారిత్రాత్మకమని చెప్పారు. ఆర్డీవో రవీంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ మహమ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నమ్మ, పట్టణ పార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల** : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి అన్నారు. కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు ఎంఈఓ చిట్టిబాబు, వార్డు సభ్యూలు చెట్టి పద్మ, గ్రంధి ఆదిత్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం లోని గొట్టుముక్కల హైస్కూల్ లో జగనన్న విద్యా కానుక కిట్లు గ్రామ మాజీ సర్పంచ్ గుదే రంగారావు పంపిణీ చేశారు. **ప్రజాశక్తి-మైలవరం** : కార్పోరేట్ స్కూల్‌లకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దుతున్నామని స్థానిక శాసనసభ్యులు వసంత కష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పథకం కింద వచ్చిన కిట్లను మంగళవారం విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్కరికి రూ.2500 విలువైన కిట్లను అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద పిల్లలకు జగనన్న విద్యా కానుక వరం లాంటిదన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ రత్నం శ్యాంబాబ్ సర్పంచ్ ఉప సర్పంచ్ జడ్పిటిసి ఎంపిపి స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - తిరువూరు** : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠ శాల జగనన్న విద్యాకానుక కిట్లను జడ్పీటిసి యరమల రామచంద్రారెడ్డి సోమవారం విద్యార్థినులకు అందజే శారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతా నికి ముఖ్యమంత్రి జగన్ ఎన్నో ఉచితంగా విద్యార్థులకు విద్యాకానుక కిట్లు తో పాటు జగనన్న గోరుముద్ద, సురక్షిత మైన మంచినీరు, కార్పొరేట్ స్థాయిలో నాడు, నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీచైర్మన్ నాగఫణి, ప్రధానోపా ధ్యాయుడు పి.సత్యనారాయణరాజు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట** : పట్టణంలోని ఆరోవార్డు కాకానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లను మున్సిపల్ వైస్ చైర్మన్, ఆరో వార్డు కౌన్సిలర్ తుమ్మల ప్రభాకర రావు, ఐదవ వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ లు అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు, వైసీపీ నాయకులు జార్జి, దాసు, ప్రిన్సిపల్ వాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.అలాగే మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు ను సర్పంచ్ గుగులోతు మణి హుస్సేన్, విద్యా కమిటీ చైర్మన్ ధారవత్ తావురియాలు విద్యార్థులు కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద భూక్యా సక్రు నాయక్ విద్యార్థులు కు టై లు త్వరలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కసుకుర్తి మంగతాయమ్మ, ఉపాధ్యాయులు టి.వి.సుజాత, ఆరోగ్య మేరి, వసంత పాల్గొన్నారు.**ప్రజాశక్తి - విజయవాడ రూరల్** : విజయవాడ రూరల్ మండలం జగనన్న విద్యా కానుక-4 పంపిణీ కార్యక్రమం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. విజయవాడ రూరల్ మండల జిల్లా పరిషత్ సభ్యుడు (జెడ్పీటీసీ) కె.సువర్ణరాజు, మండల పరిషత్ చైర్ పర్సన్ చెన్ను ప్రసన్నకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యార్యారెడ్డి నాగిరెడ్డితో కలిసి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం, షూలతో కూడిన విద్యా కానుక కిట్‌ల పంపిణీని వెంకటరత్నం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, విజయవాడ రూరల్ మండల పరిషత్ చైర్ పర్సన్ చెన్ను ప్రసన్నకుమారి, నున్న జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు** : పెనుగంచిప్రోలు గ్రామంలో పెనుగంచిప్రోలు, కె.వి.ఆర్, జడ్పీహెచ్ హైస్కూల్ , ప్రధాన ఉపాధ్యాయురాలు కె. జలజా అధ్యక్షతన సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. పెనుగంచిప్రోలు, గ్రామ మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, పెనుగంచిప్రోలు మండల ఎంపీపీ మార్ట్యపుడి గాంధీ, జెడ్పిటిసి ఉట్ల. నాగమణి, పెనుగంచిప్రోలు తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- వత్సవాయి** : ప్రభుత్వం ప్రతి విద్యార్థికి వేలాది రూపాయలు పెట్టి జగనన్న విద్యా కానుక కిట్స్ పంపిణీ చేస్తుందని జడ్పిటిసి యేసుపోగూ దేవమణి అన్నారు. మండల కేంద్రమైన వత్సవాలు హైస్కూల్ నందు మండల విద్యాశాఖ అధికారి నాగరాజు నాయక అధ్యక్షతన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, గ్రామ సర్పంచి భూక్య చేత సొసైటీ ప్రెసిడెంట్ రంగశెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

వత్సవాయిలో...

తిరువూరులో...

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభం అయిన దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ వో యం వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పాఠశాలల్లో సౌకర్యాలు, కోర్టు కేసుల పరిష్కారం, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు, జిల్లాలో అభివద్ధి పనులు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుండి పాఠశాలలు తిరిగి ప్రారంభించిన దష్ట్యా ఇంజనీరింగ్ అధికారులు విద్యాశాఖ అధికారులు స్పందన కార్యక్రమం అయిన తర్వాత పాఠశాలలను సందర్శించి అక్కడ విద్యార్థులకు కావలసిన మంచినీరు, మరుగుదొడ్లు ఇతర వసతులు ఉన్నాయా లేవా పరిశీలించాలన్నారు. అలాగే నాడు నేడు అభివద్ధి పనులు పూర్తయ్యాయా లేదా గమనించాలన్నారు. అలాగే జిల్లాలో పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు సంబంధిత అధికారులు కౌంటర్ ఫైలు వెంటనే దాఖలు చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఈ శుక్రవారం ఉండే అవకాశం ఉన్నందున పెండింగ్లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగిన సంబంధిత శాఖ ఉన్నతాధికారికి తెలిసి ఉండాలని అంతేకాకుండా వాటి వివరాలు కూడా తన దష్టిలో ఉంచాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల ర్యాలీ

ప్రజాశక్తి-చల్లపల్లి : వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఆరోగ్య కార్యకర్త వీరమ్మ తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని కొత్త మాజీరు అంగన్వాడి 1వ కేంద్రంలో భాగీదారి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తొలుతగా అంగన్వాడి కేంద్రం నుండి రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు పిల్లలకు అంగన్వాడి కేంద్రంలో అందిస్తున్న సేవలను నిర్వహించారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని కార్యకర్తలు తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ శివకుమారి, ఎం నాగరాజు కుమారి, జేఎన్ బసవపూర్ణ, ఆశ కార్యకర్తలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

ప్రజాశక్తి-గన్నవరం : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయ వర్డ్ వాలంటీర్స్, సచివాలయ సిబ్బందికి మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్షాప్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాన్ని నిలువెల్లా నాశనం చేస్తోంది అని, సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారన్నారు. మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్య వ్యానపరులను గుర్తించి వారిని సంబంధిత పునరావాస కేంద్రాలను సంప్రదించి చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకురావాలన్నారు. ప్రతి గ్రామ వర్డ్ వాలంటీర్, మహిళా పోలీస్ లు ప్రతి కుటుంబ సభ్యులను యువతను గమనించాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల కు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, కౌన్సిలింగ్ మరియు డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని కోరారు. మత్తు పదార్థాలతో వ్యక్తులలో ఒంటరితనం, డిప్రెషన్కు సోషల్

మాట్లాడుతున్న శేఖర్బాబు

మీడియా కారణమవుతుందని, తద్వారా అనేక మందిలో మందిలో నిద్ర లేమికి కారణమవుతుందని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయన్నారు. జోనల్ కోఆర్డినేటర్ కె ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం నుండి బైటకు తీసుకురావడానికి డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణస్థితికి.. తీసుకురావచ్చు అన్నారు. నూజివీడు మండలం పొనసనిపల్లి లో ఈచికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమములో కేసరపల్లి గ్రామ సర్పంచ్ కుమారి చేబ్రోలు లక్ష్మి మౌనిక, పంచాయతీ సెక్రెటరీ యమ్. మౌనిక , మహిళా సంరక్షణ కార్యదర్శి కె.నాగ మల్లీశ్వరి గ్రామ వర్డ్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కైతేపల్లి దాస్ స్థానిక నారాయణరావు నగర్లోని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకునేందుకు రాగా స్కూల్ పేరెంట్ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. విద్యా రంగంలో వినూత్న సజనాత్మకత జోడించి భోధన చేస్తూ 1989 నుండి 34 సంవత్సరకాలంగా హెడ్మాస్టర్గా పనిచేస్తూ మండల, జిల్లా, రాష్ట్ర, రిసోర్స్ వర్గానికి పనిచేస్తూ అనేక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా దాస్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల సహకారంతో పాఠశాలను అభివద్ధి చేయడం, నాణ్యమైన విద్యను అందించడం కోసం కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల కో ఆప్షన్ సభ్యులు నభి ఘోరీ,చైర్మన్ అమినభి, స్థానిక నాయకులు నర్రా సురేంద్ర చిన్ని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేడు డయల్ యువర్ డియం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11.00 గంటల నుండి 12.00 గంటల వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. గన్నవరం పరిసర ప్రాంత ప్రయాణికులు, గన్నవరం డిపో బస్సులకు సంబదించి వారి సలహాలు, సూచనలు,సమస్యలను 8790996090 నెంబర్ కు ఫోన్ ద్వారా తెలియజేసి, మెరుగైన సౌకర్యాలు కల్పించంచడానికి తోడ్పాడాలని కోరారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

- జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో డిఆర్ఓ ఆర్డిఓ ఐ కిషోర్, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్ లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిఆర్వో జిల్లా అధికారులు అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. బాలబాలికలపై జరుగుతున్న హింస, దోపిడీ అత్యాచారాలను వ్యతిరేకించాలని, బడి బయట ఉన్న బాలలందరిని బడిలో చేర్చాలని, బాల కార్మిక వ్యవస్థ, బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలనకు, ఆపదలో ఉన్న బాలలందరి రక్షణకు అండగా ఉండాలని, బాలల హక్కుల పరిరక్షణ కోసం బాలమిత్రులుగా ఉండాలని, చైల్డ్ లైన్ - 1098 కి గాని, పోలీస్ 100/112 లేదా ఉమెన్ హెల్ప్ లైన్ 181కి గానీ ఫోన్ చేసి తెలపాలని, జిల్లాను బాలల స్నేహ జిల్లాగా చేయుటకు అందరూ తమ వంతు కర్తవ్యం గా నిర్వహించాలని డిఆర్ఓ పిలుపునిచ్చారు. జూన్ మాసం అంతా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ గీతా బాయి, సిపిఓ వై శ్రీలత,ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. జనార్ధన్ రాజు , ఐసిడిఎస్ పిడి ఎస్. సువర్ణ, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, రహదారులు భవనాల ఇంజనీరు శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకే టీచర్గా వచ్చిన ఉషారాణి

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్జంక్షన్) : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన మోర్ల ఉషారాణి ఉపాధ్యాయుల సాధారణ. బదిలీల్లో భాగంగా నూజివీడు మండలం సీతారా మపురం నుండి వీరవల్లి ఎంపి యూపి స్కూల్ కిబదిలీపై వచ్చారు. ఉషారాణి తండ్రి మోర్ల పండుకి ఇద్దరు ఆడపిల్లలు. మొదటి కుమార్తె ఉషారాణి. పండు సైకిల్ మెకానిక్ గా పనులు చేస్తూ ఇద్దరు ఆడపిల్లలును ఉన్నత చదువులు చదివించారు. తాను చదువుకున్న సొంత గ్రామంలోనే ఉపాధ్యా యురాలు పనిచేసే అవకాశం రావటం తనకెంతో ఆనం దంగా ఉందని ఉషారాణి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతులు అందచేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం రామానగరం కేంద్రంగా బోలెం భాస్కరరావు ఛారిటబుల్ ట్రస్ట్ లక్ష్మీపురం శ్రీ దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో బొలెం రామారావు అధ్యక్షుడిగా ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు తన తండ్రి భాస్కర్ రావు పేరుతోఏర్పాటు చేసిన సందర్భంగా తొలి సేవా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన 15మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, రామారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని శీపూడి శివారులోని కాశీపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామస్వామి మందిరంలో రాముడు సీత, లక్ష్మణుడుల విగ్రహాలను ప్రతిష్టను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ బ్యాంక్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ గంజా విజయకుమార్ వితరణతో ఏర్పాటు చేసిన స్వామి వారి విగ్రహలను ప్రతిష్టంచారు. తెల్లవారుజాము నుండి గోపూజ పుణ్యాహవాచన, లక్ష్మీ గణపతి హెూమంను స్వర్ణసత్యసాయి మణికంఠ గురుక్కుల్ అధ్వర్యంలో శాస్త్రోంకంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంజా నారాయణ, అలయ ధర్మకర్తలు గుంజ సోదరులు, అలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వం పాఠశాలలను పున ప్రారంభించిన దష్ట్యా అవనిగడ్డ ఆర్టీసీ డిపో పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్ పాస్లను పంపిణీ చేసే కార్యక్రమం డిపోలో ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలికలకు 10 వ తరగతి వరకు, బాలురకు 12 సంవత్సరాల వయసు వరకు విద్యార్థుల నివాస స్థలము నుండి పాఠశాలకు 20 కిలోమీటర్ల దూరం వరకు ఇవ్వనున్నట్లు చెప్పారు.వీటిని తీసుకొనుటకు విద్యార్థులు పాఠశాల నుండి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, జెరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను తీసుకొని డిపో నందు రూ 50 రూపాయలు రుసుము చెల్లించి పొందవచ్చునని తెలిపారు. ఈ ఉచిత పాసులు ఏప్రిల్ 30 2024 వరకు ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. అదేవిధంగా హై స్కూల్ కళాశాల విద్యార్థులు విద్యార్థులకు రాయితీ పాసులు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. రాయితీ పాసులను మూడో వంతు చార్జి మాత్రమే చెల్లించి పొందవచ్చునన్నారు. విద్యార్థులు కళాశాల స్కూలు నుండి స్టడీ సర్టిఫికెట్ ఆధార కార్డు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు రెండు తీసుకొని ఆవనగడ్డ డిపో నందు బస్సు పాస్ కౌంటర్లో పొందవచ్చును అన్నారు. ఈ రాయితీ పాసులు విద్యార్థుల కు నివాస స్థలము నుండి 50 కిలోమీటర్ల దూరం వరకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

హెచ్ఎంకు సత్కారం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం చిట్టూర్పు యూపీ స్కూల్ హెచ్.ఎం అరుణ కుమారి బదిలీపై నాగాయలంక మండలం పెదపాలేం వెళ్లగా, సోమవారం ఆమెకు వీడ్కోలు పలికి గ్రామస్తులు, తల్లిదండ్రులు పూలమాలలు దశ్యాలువ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, పాల కేంద్రం అధ్యక్షులు దాసరి ప్రభుకుమర్, దాసరి వెంకట సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంఛార్జి గుత్తికొండ ప్రసాద్, గ్రామ పెద్దలు, వేములపల్లి వెంకట రావు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల షాపు ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : నూతన టైక్నలజీతో అందుబాటులోకి వచ్చిన జెమిని కళ్ళజోడ్ల షాపును సద్వినియోగం చేసుకోవలని అర్బన్బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) అన్నారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జెమిని అప్టికల్ షోరుమ్ను డాక్టర్ బండారు శ్యామ్కుమార్తో కలసి పిన్నమనేని బాబ్జి ప్రారంభించారు. పిల్లల వైద్య నిపూణులు ఐఎంఏ గుడివాడ శాఖ కార్యదర్శి పిన్నమనేని శివరామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేతపై పేదల ఆగ్రహం

ప్రజాశక్తి-మైలవరం : రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. కాస్తంత జాగా ఏర్పాటు చేసుకొని మూడు దశాబ్దాలు పైగా నివాసం ఉంటున్నారు. ఆ స్థలాలపై కొంతమంది అధికార పార్టీ నాయకులు కన్ను పడింది. ఇంకేముంది రెవెన్యూ పంచాయతీ అధికారులచే నోటీసులు ఇప్పించి పోలీస్ అధికారులు సహాయంతో సోమవారం ఉదయం ఆ నివాసాలను ప్రొక్లైన్ సహాయంతో కూలగొడుతున్నారు. దీంతో బాధితులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. బాధితులు, అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే తిరువూరు బైపాస్ రింగ్ వద్ద శాంతినగర్ కు వెళ్లే మార్గంలో గతంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో నూతక్కి ప్రసాద్, కందుల సామేలు, వంగూరి వసంతం,గురజాల సుబ్బమ్మలు నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు వీరికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వీరి నివాసాల మధ్య కొంత ఖాళీ స్థలం ఉంది.2019 వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో 50 లక్షలు ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి అప్పటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణ పనులు మరుగున పడ్డాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది నాయకులు కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నామని ఇల్లు ఖాళీ చేయాలని వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. అందుకు వారు శసేమిరా అంటూ ఖాళీ చేసే ప్రసక్తి లేదని నాయకులకు చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం రెవెన్యూ పంచాయతీ అధికారులు అక్కడకు చేరుకొని పోలీసుల సహకారంతో నోటీసులు అందజేసి ఇల్లు కూల్చివేతలకు పాల్పడ్డారు. బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో కొంతమందికి గాయాల య్యాయి. ఆందోళన చేస్తున్న పలువురిని మైలవరం ఎస్సై హరిప్రసాద్ అదుపులో తీసుకొని పోలీసు వాహనంలో స్టేషనుకు తరలించారు. ఉన్న పలంగా తమను ఖాళీ చేయాలని ఇల్లు కూల్చడం ఏమిటని, అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు కావాలనే తమ ఇళ్లను కూల్చుతున్నారని బాధితులు వాపోయారు. అనంతరం మాజీ మంత్రి,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు బాధితులను పరామర్శించారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించి ఇల్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు కూల్చివేతకు పాల్పడితే అడ్డుకున్న బాధితులను పోలీసులు లాఠీలతో కొట్టి స్టేషన్ కు లాక్కెళ్లడం దుర్మార్గమన్నారు.ఈ విషయాన్ని జాతీయ ఎస్సి కమిషన్ దష్టికి తీసుకెళ్లనున్నట్లు ఉమా తెలిపారు.

బాధితులను అడ్డుకుంటున్న పోలీసులు

బాధితులను పోలీస్ స్టేషన్ తరలిస్తున్న పోలీసులు

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి-తిరువూరు : విద్యాహక్కు చట్టం ప్రకారం 6నుండి14 సంవత్సరాల మధ్య వయసున్న పిల్ల లు కచ్చితంగా బడిలో ఉండాలని, చదువుకోవడం వారి హక్కని మండ లంలోని గానుగపాడు సర్పంచ్ వేమి రెడ్డి కష్ణవేణి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీని సోమవారం గ్రామంలో ఆమె ప్రారంభిం చారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూ లించడానికి ప్రభుత్వం విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. బాలకార్మిక వ్య వస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. అనంతరం విద్యార్థులకు కిట్లను పంపి ణీ చేశారు. ఈకార్యక్రమంలో గానుగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు సాయిరాం, రాజేంద్రప్రసా ద్, రాంప్రదీప్, సుదర్శన్, సాంబశివరా వు, వెంకటేశ్వర్లు, రాము, రామారావు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బాలలు బడి బయట ఉండడానికి వీల్లేదు

- జిల్లా న్యాయ సేవ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : 14 సంవత్సరాల లోపు బాలలు ఎట్టి పరిస్థితుల్లో బడి బయట ఉండడానికి వీల్లేదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ సెక్రటరీ కె.వి. రామకృష్ణయ్య సూచించారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కోర్టు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ కృష్ణయ్య మాట్లాడుతూ ఏ రంగాల్లో బాల కార్మికులు పనిచేస్తున్నా వారిని గుర్తించి వారి వికాసానికి పాటుపడాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ లను నిర్వహించామన్నారు. సహాయ కార్మిక కమిషనరు ఎస్.గోవింద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల మొదటి తేదీ నుండి నెలాఖరు వరకు బాల కార్మికుల నిర్మూలనకు పెద్ద ఎత్తున చర్యలను చేపట్టామన్నారు. జిల్లాలో వివిధ శాఖల అధికారులతో టాస్కోర్స్‌ను ఏర్పాటుచేసి వివిధ ప్రదేశాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తిస్తున్నామన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో బాలలతో పనిచేస్తే ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. వివిధ సంస్థల యజమానులు చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి బాల కార్మికుల నిర్మూలనకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి జి.వి.సారథి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్మికశాఖ సిబ్బంది, హైనీ హైస్కూల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కండ్రికలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-సింగ్‌నగర్ : స్థానిక 64వ డివిజన్‌లో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. కండ్రిక కాలనీ కేర్ అండ్ షేర్ స్కూల్ నుండి ఈ కార్యక్రమం టిడిపి నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి విజయమూరి సతీష్ బాబు, సెంట్రల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అన్వర్ పాల్గొన్నారు.

వృత్తివిద్య కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పరిసర ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తతంగా కల్పించే లైఫ్ స్కిల్స్ ఇంటర్మీడియట్ వృత్తి విద్య కళాశాలను జగ్గయ్యపేటలో ప్రథమంగా ఏర్పాటు చేయటం ఈ ప్రాంత విద్యార్థులకు సువర్ణ అవకాశమని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ విప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పరిశ్రమల కేంద్రీకతం అవ్వడం వలన బాలికలకు ఉపాధి అవకాశాలను విస్తతం చేయడం కోసం ఏర్పాటుచేసిన ఈ కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ నూతన కళాశాలలో బాలికల కోసం ఎంపిహెచ్‌డబ్ల్యు, ఏం ఎల్ టి (లాబ్ టెక్నీషియన్), ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఇ టి), డైరీ టెక్నాలజీ వెటర్నరీ వంటి మెరుగైన ఉపాధి అవకాశాలను అందించే కోర్సులను ఈ సంవత్సరం నుండే ప్రారంభించటం అభినందనదాయకం అన్నారు. మెరుగైన సౌకర్యాలతో ఈ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఈ నూతన లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఈనెల 14న జరిగే ప్రారంభోత్సవ బ్రోచర్‌ను స్థానిక శాసనసభ్యులు వారి స్వగహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర, శేషం ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఉదయభాను

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని 11వ వార్డు దుర్గాపురం నందు సోమవారం మెప్మా సిబ్బంది, కనకదుర్గా మహిళా సమాఖ్య వారు ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాపురం పరిసర ప్రాంత ప్రజలను కలిసి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దుర్గాపురం నందు పారిశుద్ధ్య సమస్యను స్థానికులు వివరించగా చైర్ పర్సన్ సానుకూలంగా స్పందించి అక్కడ ఉన్న పారిశుద్ధ్య సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆలోచనలను అనుసరించి పట్టణంలో పలు అభివద్ధి పనులను చేపట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి పట్టణ అధ్యక్షులు ఆకుల బాజి, యువజన విభాగ అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తుల సుధాకరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీలో 31 సంవ త్సరాలు ఉద్యోగం చేసి కార్మికుల సమ స్యలపై అలుపెరుగని పోరాటం కొనసాగించిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) సీనియర్ నాయకులు బత్తుల సుధాకరరావు 8వ వర్ధంతి ని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తిరు వూరు బస్టాండ్ ఆవరణలో సోమవా రం నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళు లర్పిం చారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈకార్యక్రమం లో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, ఎస్ డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు బి.వి.రావు, డిపో కార్యదర్శి కె.వి.రావు, సిపిఎం నాయ కులు నూకల సత్యనారాయణ, భద్రం, సంజీవరావు, విష్ణు తదితర కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠశాలలు పున: ప్రారంభం

ప్రజాశక్తి - మొవ్వ : వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖాధికారులు పనివేళలను వారంపాటు సవరించిన తరుణంలో ఉదయం 7.30 గంటలకు వేసవి సెలవుల విరామానంతరం బడిగంటలు మోగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లను మొవ్వ జడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపిపి కొండేటి ఇందిర ,ఎంపిటిసి సభ్యులు వెలగం వెంకటరమణ తదితరులు హాజరై కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ లో పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి నందిగామ : నందిగామ పట్టణంలో జరుగుతున్న అభివద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు కౌన్సిలర్లకు సూచించారు. నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వార్డు ఇన్ఛార్జిలు, పట్టణ ముఖ్య నాయకులతో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నందిగామ పట్టణంలో చేసిన అభివద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఆయా స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందని, గడిచిన నాలుగేళ్లలో 2 సంవత్సరాలు కరోనా రూపంలో వధా అయినప్పటికీ మిగిలిన రెండేళ్లలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో నందిగామ పట్టణాన్ని అభివద్ధి చేశామని చెప్పారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణ, 2 అర్బన్ హెల్త్ క్లినిక్ ల ఏర్పాటు, నగర పంచాయతీ నుండి మున్సిపాలిటీగా అప్ గ్రేడేషన్, ఓపెన్ జిమ్, ఇంటింటికి తాగునీటి కుళాయి పనులు, రూ.15 కోట్లతో డ్రైనేజీల నిర్మాణాలు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు, ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు లాంటి పలు ప్రతిష్టాత్మక పనులను చేశామన్నారు. ఇప్పటికే స్థానికంగా ఆయా వార్డుల్లో చేపట్టిన అభివద్ధి పనుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పలుచోట్ల విద్యా దీవెన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని పాఠశాలల్లో జగనన్న విద్యాదీవెన కిట్లను సోమవారం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉంగుటూరు (గన్నవరం) : మండలంలోని ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల పరిషత్ అధ్యక్షులు వి.సరోజినీ, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు దుట్టా సీత రామ లక్ష్మి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీచేశారు. ఎం.పి.డి.ఓ జి.ఎస్.వి శేషగిరిరావు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ అనిత, గ్రామ సర్పంచ్ కె.వర ప్రసాద్ , విస్తరణాధికారి ఎం.అమీర్ బాష, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గన్నవరం :** గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల హెడ్ మాస్టర్. ఎంవి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజా బెత్ రాణి మాట్లాడారు. గ్రామ సర్పంచ్ వేము రాధాకృషణ, పాఠశాల కమిటీ చైర్మన్ రాజేష్,వైఎస్సార్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ భాజి, ఉపాధ్యాయులు దామోదర గణపతి పాల్గొన్నారు. **గన్నవరం :** గన్నవరం బాలుర ఉన్నతపాఠశాలలో కిట్లను గన్నవరం జడ్. పి సభ్యురాలు ఎలిజబెత్ రాణి పంపిణీచేశారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని అధ్యక్షత వహించారు. కళాశాల సీనియర్ అధ్యాపకురాలు ఉమ సీనియర్ ఉపాధ్యాయులు మోహిని కృష్ణ కుమారి, మాణిక్యాలరావు, రవి బాబు, గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిప్పడ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరు మండల పరిధిలోని స్వతంత్ర పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్టులను విద్యార్థులకు జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు తిమ్మన వెంకట నాంచారయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలా వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ గళ్ళ శ్రీనివాసరావు , రామకష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విశ్వనాధపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించారు. జిల్లా రైతు నాయకులు కొండవీటి వెంకట నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, పిసి కమిటీ చైర్మన్ ఆంజనేయులు ,తోపాటు పాఠశాల ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు. రామకష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు జగనన్న విద్యా కానుకను గ్రామ ప్రముఖులు దేవనబోయన వెంకటేశ్వరరావు, చేబోయిన వెంకట కష్ణారావు, అద్దంకి పాండురంగారావు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారాని నాగార్జున, సచివాలయ కార్యదర్శి కడవకొల్లు సుబ్బారావు, ఉపాధ్యాయులు వేముల వీర రాఘవయ్య, పెరవలి రాంబాబు, మన్నే ప్రేమ్చంద్ , పీసీ చైర్మన్, తో పాటు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** లంకపల్లి గ్రామంలో జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపిపి కాసాని వేద సుప్రజ పంపిణీచేశారు. లంకపల్లి గ్రామ సర్పంచ్ వేమూరి రత్నకుమారి పాల్గొన్నారు. హనుమంతపురంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గ్రామ సర్పంచ్ కలపాల రాంబాబు, శొంటి వెంకటేశ్వరరావు, తాడంకి ఉన్నత పాఠశాలలో యేనుగు మస్తానరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, మద్రివాడలో రమేష్, ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కేశవ నారాయణ, ఉపాధ్యాయులు రమేష్, పైడికొండలో పాలెంలో ఉపాధ్యాయుల దుర్గాప్రసాద్, కపిలేశ్వరపురంలో సిఆర్పి రవితేజ, మేడూరులో గరికిపూడి బుజ్జి, చోరగుడి పాఠశాలలో సర్పంచ్ కందిమళ్ల పూర్వకుమారి, వేల్పూరులో సర్పంచ్ దిలీప్కుమార్ కిట్లను పంపిణీచేశారు.

పమిడిముక్కల మండలంలో

ఉంగుటూరు మండలంలో

గుడ్లవల్లేరు మండలంలో

కోడూరు మండలంలో

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రూ. 25వేలు విలువ గల నోట్ బుక్స్ను ఆ గ్రామ వాస్తవ్యుడు మోదుగమూడి అంకాలరావు అందజేశారు. హైదరాబాదులో వి క్యూబ్ ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించి తద్వారా తన స్వగ్రామంలో సేవా కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశ్యంతో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 1నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి క్యు బ్ సభ్యుడు పామర్తి వీర రాఘవులు, విద్యా కమిటీ చైర్మన్ మోదుగమూడి ప్రసాదు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి: ఎస్పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ కషి చేస్తానని జిల్లా ఎస్పీ పి. జాషువా అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగ్ చేసి పారదర్శకంగా పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియ నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా 5 సంవత్సరాలు పూర్తి చేస్తుకున్న, ప్రమోషన్స్ పొందిన హెడ్ కానిస్టబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి సిబ్బంది, కానిస్టేబుల్ వరకు బదిలీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4 సబ్ డివిజనులోని 37

మంది అందులో 07 గురు ఏఎస్ఐలు, 22 మంది హెడ్ కానిస్టేబుల్స్, 08 మంది కానిస్టేబుల్స్ బదిలీ అయ్యారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఓకే చోట ఐదు సంవత్సరాల పాటు విధులు నిర్వహించడంతో వేరే చోటకి వెళ్ళడం కొందరికి బాధగా ఉంటుందన్నారు. అయితే బదిలీలు ఎంతో ఉత్సాహాన్ని, నూతన బాధ్యతలను పెంచుతాయని తెలిపారు. బదిలీపై కొత్త ప్రదేశానికి వెళ్ళిన సిబ్బంది సమస్యలలో ఉన్న బాధితులకు అండగా నిలవాలని కోరారు. వారు నిర్వర్తించే విధుల్లో పోలీస్ శాఖ యొక్క ప్రతిష్ట పెంపొందించాలని ఆకాక్షించారు. సిబ్బంది బదిలీల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించడం, ఖాళీల ఆధారంగా కోరుకున్న చోటే పోస్టింగ్స్ ఇవ్వడంతో ఎస్పీకి సిబ్బంది కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఆర్ శ్రీహరి బాబు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతోందని పమిడిముక్కల

మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య అన్నారు. పమిడిముక్కల మండలంలోని ముసలినాయకపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు ద్వారా జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేస్తున్నారన్నారు. తద్వారా నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సికొల్లు, కుమార్, రాంబాబు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు

హోంగార్డులకు యూనిఫాం అందచేత

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని వితరణతో హెూంగార్డులకు యూనిఫాం పంపిణీ జరిగింది. అనిల్ వంశీ, అఖిల్ వంశీల పుట్టినరోజును పురస్కరించుకుని చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 15 మంది హెూంగార్డులకు యూనిఫాంను సోమవారం పంపిణీ చేశారు. చల్లపల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఐ బి. భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సిహెచ్.చినబాబు,అనీల్ వంశీ,,అఖిల్ వంశీ హెూంగార్డులకు యూనిఫాంను అందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాల్యాద్రికి పితృవియోగం

గుడివాడ: సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి గునుకుల మాల్యాద్రి తండ్రి గునుకుల నర్సయ్య(77) ఆదివారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. గుడివాడ

నివాళులరిపసుతన్న నాయకులు

బైపాస్ రోడ్డులోని ఆయన స్వగృహంలో నర్సయ్య భౌతికకాయాన్ని పలువురు నేతలు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. యుటిఎఫ్, ఎస్టీయు, పిఆర్టీయు, సాహితీ స్రవంతి, కృష్ణా ఆర్ట్స్, చార్లీ చాప్లిన్ కామెడీ క్లబ్, సరిగమ సంగీత పరిషత్ నాయకులు, సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి, మస్తాన్, సుందరరావు, బేతాళరావు,పి.వెంకటేశ్వరరావు, మల్లిక్ తదితర నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

గన్నవరం : గన్నవరం రాయనగర్కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని మొహమ్మద్ జాస్మిన్ ఇంట్లో ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి జకీర పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సిఐ పి.కనకారావు కథనం ప్రకారం మృతురాలు జాస్మిన్ విజయ కాలేజీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాయనగర్కు చెందిన జుబేర అనే వ్యక్తి ఆమెను మోసం చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ

గుడివాడ మల్లాయిపాలెంలో టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సిఎం వైఎస్ రాజశేఖర్రెడ్డి హయాంలో గుడివాడ పట్టణంలో కూడా ఇళ్ల స్థలాల కేటాయింపునకు మూడు దశలుగా నిర్ణయించారన్నారు. మొదటి దశలో

మాట్లాడుతున్న ఆర్సిపి రెడ్డి

బావాజీమఠంలో ఇచ్చారన్నారు. రెండోదశలో 1800 మందికి 70 ఎకరాలు భూమి కొని అప్పట్లో స్థలాలు ఇచ్చారన్నారు. అనేక సార్లు తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసి ఆ స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్చేశామన్నారు. 70 ఎకరాల్లో కొంతమందికి రుణాలు కూడా రావటంతో కొందరు గృహాలు కూడా కట్టుకున్నారన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 70 ఎకరాలు స్థలం ఉన్నందున ఐదేళ్లకు చివరి రోజుల్లో జి ప్లస్ 2 ఇళ్ల నిర్మాణాన్ని 3,000 ఇళ్లు కట్టడం, మౌలిక వసతులకు మాత్రం టెండర్లు వదిలేసిన పరిస్థితి ఉందన్నారు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా నాలుగు సంవత్సరాల తర్వాత ఆ టిడ్కో ఇళ్లను ఇదిగో..అదిగో ఇస్తామని చెప్పి వాయిదాలపై వాయిదాలు వేస్తోందన్నారు. ఈనెల 16న సిఎం జగన్ చేతులమీదుగా ఇస్తామని చెబుతున్నారనీ, అది కూడా ఎంతవరకు నిజమో చూడాలన్నారు. వాస్తవంగా పరిశీలిస్తే టిడ్కో గృహాలకు తాగునీటి సమస్య ఉందన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఇరుకురోడ్డు ఉందన్నారు. వంతెన నిర్మాణం కూడా పూర్తికాలేదన్నారు. కాలువ గట్టు రోడ్డు మాత్రం కాస్తా అభివృద్ధి చేశారనానరు. 100 అడుగుల రోడ్డుని అభివృద్ధి చేయకపోతే వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు. కరెంటు మీటర్లకు రూ. 450 కట్టించుకున్నారనీ, ఎప్పుడు బిగిస్తారో చెప్పటం లేదన్నారు. 2006లో రాజశేఖర్ రెడ్డి స్థలాలను సేకరించి ఇప్పటికి 14 ఏళ్ల అయిపోయిందన్నారు. పేదవాడు ఇంటికల కోసం అప్పట్లో 1800 మందికి అక్కడ ఇచ్చారన్నారు. ఆలస్యం కావటంతో అదే స్థలంలో ఇప్పటికి జి ప్లస్ 2 మారి 8916 ప్లాట్లుగా మారిందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ నగర్ అని పిలిచేవారనీ, ఇప్పుడు వైసిపి పాలకులు వైఎస్సార్ నగర్గా పిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.కొండ, ఎండి హాఫీజా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టరు ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్‌కుమార్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు ప్రజల నుండి 118 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు డిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వం పై నమ్మకంతో స్పందన కార్యక్రమం ద్వారా తన సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో వస్తున్న ప్రతి అర్జీదారుని సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. అధికారులు సమస్యను నిశితంగా పరిశీలించడం ద్వారా సమస్య తేలికగా పరిష్కారం అవుతుందన్నారు. కొంత మంది అర్జీదారులు గ్రామ స్థాయిలో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కూడా స్పందనకు వస్తుంటారని అటువంటి వారికి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. స్పందనలో శాఖల వారిగా పరిశీలిస్తే ఎక్కువగా నమోదవుతున్న రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ తదితర శాఖల అధికారులు అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం స్పందన ఫిర్యాదుల పరిష్కారం పై దృష్టి పెడుతున్నందున అర్జీదారులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు విధులను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైటప్: అర్జీలను స్వీకరిస్తున్న మేయర్, పక్కన కమిషనర్

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

నిర్దేశించిన గడువులోగా అర్జీలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 11 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీల పరిష్కారానికి సకాలంలో పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ కాలువల సమస్యలను అర్జీల రూపంలో ప్రజలు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 78 అర్జీలు

స్పందనకు వచ్చే అర్జీలను ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రూరల్ డిసిపి అజిత్ వేజెండ్ల ఆదేశించారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి డిసిపి స్వయంగా 78 అర్జీలను స్వీకరించారు. వృద్ధులు, వికలాంగులు వారి వద్దకు స్వయంగాడిసిపి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా ఎస్‌హెచ్‌ఒలను డిసిపి ఆదేశించారు.

ఒకే ప్లాట్ ఇద్దరికి అమ్మకం

ప్రజాశక్తి-భవానీపురం: ఒకే ప్లాట్‌ను ఇద్దరికి అమ్మిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వాహకులపై సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విశాఖపట్నం అల్లిపురంలో ఉంటున్న సూరిశెట్టి వెంకటసత్యప్రసాద్ ఉంటున్నారు. మెసర్స్ కీస్టోన్స్ ఇన్‌ఫ్రాకాన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన డైరెక్టర్స్ లింగం శ్రీనివాస్, కెవిఎస్ నాగరాజులు భవానీపురం జోజినగర్ వద్ద 'ఏవిఎస్ఆర్ స్టై, కోర్టు' పేరుతో అపార్ట్‌మెంట్‌ను నిర్మించదలిచారు. దానిలో ఫ్లాట్ నెంబరు 1405ను సత్యప్రసాద్ కొనుగోలు చేయుటకు 2017 జూన్ 5వ తేదీన అగ్రిమెంట్ ఆఫ్ సేల్ రాసుకున్నారు. 1307 ఎస్‌ఎఫ్‌టి విస్తీర్ణం గల ఫ్లాట్ ఖరీదు రూ.58.25 లక్షల్లో రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చారు. తర్వాత లోను కొరకు ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిని సంప్రదించారు. దీంతో ఇండియన్ బుల్స్, బిల్డర్ అయిన కీస్టోన్స్ ఇన్‌ఫ్రాకాన్ వారు ముగ్గురూ కలిసి ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ అగ్రిమెంట్ నిమిత్తం ఇండియా బుల్స్ వారు బిల్డర్ కంపెనీకి యాక్సిస్ బ్యాంక్ ద్వారా రూ. 32,96,475లు చెక్‌ను అందజేశారు. బిల్డర్‌ను చాలాసార్లు ఫ్లాట్‌ను రిజిష్టర్ చేయమని సత్యప్రసాద్ కోరినా ఎస్‌బిఐ వారి నుంచి ఎన్‌ఒసి రాలేదని బిల్డర్ దాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో అనుమానం వచ్చిన సత్యప్రసాద్ ఆన్‌లైన్లో ఇసి తీసుకోగా ఇతనికి అమ్మిన ఫ్లాట్ 2021 సెప్టెంబర్ 16న యార్లగడ్డ నాగేంద్రప్రసాద్ అనే వారి పేరు మీద జాయింట్ ఎస్ఆర్ఓ విజయవాడలో రిజిష్టర్ చేయబడి వుంది. కీ స్టోన్స్ ఇన్‌ఫ్రాకాన్ (ఇండియా) లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు తనకు అమ్ముతానని అగ్రిమెంట్ చేసిన ప్లాట్‌నే వేరొకరి అమ్మినట్లు గ్రహించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

33వ డివిజన్‌లో ఎమ్మెల్యే విష్ణు పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 33వ డివిజన్ 216వ వార్డు సచివాలయ పరిధిలో స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 33వ డివిజన్ అభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజావసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ.. వాటిని తీర్చడమే ధ్యేయంగా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 14 వ ఆర్థిక సంఘం నిధులు రూ. 80 లక్షలతో జిల్లా వారి వీధి, తాడంకివారి వీధి, పాపరాజు వారి వీధి, ఒగిరాల వారి వీధి, తిరుమలశెట్టి వారి వీధి, కొమ్ము వారి వీధి, కనకరాజు వీధులలో నూతన రోడ్లను నిర్మించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు లంకా బాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

జలగండం

కొత్తగూడెం జిల్లాకు చెందిన చంద్రుగుండ గ్రామానికి చెందిన పెంబుల రణదేవ్ (14) కుటుంబం బంధువుల అన్నప్రసన్న కార్యక్రమానికి తిరుపతమ్మ అమ్మ వారి ఆలయానికి వచ్చారు. ఆలయానికి దగ్గరలో వున్న మున్నేటిలో బహిర్భుమికి రణదేవ్ వెళ్లి ప్రమాదవశాత్తూ దానిలో పడి మృతిచెందాడు. ఈ సంఘటనతో తల్లి దండ్రులు బంధువులు శోక సముద్రంలో మునిగి పోయారు.

సముద్రంలో యువకుడి గల్లంతు

మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పోర్ట్ పనులు జరగుతున్న నేపథ్యంలో మచిలీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తపసిపూడి పోర్ట్ బెర్త్ నంబర్.1 దగ్గర ఫొటోలు దిగడానికి వెళ్లి సముద్రంలో ఆటో డ్రైవర్ హేమంత్ కాలు జారి పడిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏడుగురు స్నేహితులు కలిసి ఫొటోలు దిగడానికి తపసిపూడి పోర్ట్ బెర్త్ నంబర్ 1 దగ్గరికి వెళ్లినట్లు సమాచారం. కాలు జారి పడిపోయిన యువకుడు తపసిపూడికి చెందిన ఆటో డ్రైవర్ హేమంత్‌గా గుర్తించారు. ఇప్పటివరకు హేమంత్ ఆచూకీ తెలియరాలేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు ముమ్మురం చేశామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైసిపి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు మమ్మురం చేయాలని సూచించారు. ఇప్పటికీ అతని ఆచూకీ తెలియరాలేదని తాలూకా ఎస్ఐ తెలిపారు.

విద్యా రంగం అభివృద్ధికి కృషి

శ్రీవిద్య ,మనోజ్ కుమార్‌లను మంత్రి అభినందించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డీఈవో తాహెరా సుల్తానా, గుడూరు ఎంపీపీ సంఘ మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యులు సురేష్, రంగబాబు, సర్పంచ్ బొర్ర సాంబశివయ్య, డిప్యూటీ డిఇఒ యువి సుబ్బారావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు కారుమంచి కామేశ్వరరావు, గొరిపర్తి వరలక్ష్మి, పెడన ఏఎంసి ఛైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి రామానాయుడు, పెడన ఎంపిపి రాజులపాటి వాణి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఖర్చు చేస్తున్న నిధులు, పథకాలు, సౌకర్యాలు, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. సత్యనారాయణపురం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్‌తో కలిసి కలెక్టర్ జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లావ్యాప్తంగా 951 పాఠశాలల్లోని 1,15,674 మంది విద్యార్థులకు కిట్లను పాఠశాల తెరిచిన రోజునే విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, జిల్లా విద్యాశాఖ అధికారి సీవి రేణుక, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.మహేశ్వరావు , పశ్చిమ మండలం తహశీల్దార్ మాధురి, స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు రక్షణ జాతాలు విజయవంతం

అధ్యక్షులు శీలం ప్రకాశరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు సేలం నారాయణ ఎ లక్ష్మీ శైలజ, వాకా రామచంద్ర రావు, బివి శ్రీనివాసరావు, మాదు శివ నాగేశ్వరరావు, జె.రవి,దుర్గాప్రసాద్, ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు జి.కుమారి,సిఐటియు కంకిపాడు కార్యదర్శి టి. నరేష్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, కౌలు రైతులు, కౌలు రైతు సంఘం నాయకులు ఈ కౌలు రైతుల రక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు.

మంగళగిరిలో సామూహిక రాయభారం

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముగింపు జాతా సందర్భంగా విజయవాడలోని సీతమ్మవారి పాదాల వద్ద మీడియాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు మాట్లాడారు. మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయం వద్ద జాయింట్ సెక్రటరీ (లాండ్స్) ఎన్. ప్రభాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

కృష్ణాజిల్లా అధ్యక్షులు శీలం ప్రకాశరావు

కౌలు రైతు చట్టాన్ని సవరించాలని, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుదారులకు సిసిఆర్సి కార్డు ఇవ్వాలని కోరుతూ ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రెండు జాతాలు కృష్ణాజిల్లాలో విజయవంతంగా పర్యటించాయి. తోట్లవల్లూరు మండలంలో బహిరంగ సభ, పాదయాత్రను విజయవంతం చేసిన కౌలు రైతులు, ప్రజాసంఘాలు, కార్మికులు, రైతులకు అభినందనలు.



'శుక్లం' సమస్యలపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్ల అవగాహన మాసం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ వైద్యులు డాక్టరు సుషాంక్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కంటికి సంబంధించి శుక్లా నికి ప్రధాన కారణం మధుమేహం, కిడ్నీ వ్యాధి, గ్లకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్, కంటి లోపల పలు సమస్యలు, కొన్ని ప్రత్యేక మందుల దీర్ఘకాల వాడకం, ధూమపానం వంటి ఇతర కారణాలు కూడా శుక్లం పెరగడానికి దోహదం చేయ వచ్చని తెలిపారు. శుక్లాం తొలగించిన తరువాత అది తిరిగి రాదన్నారు. ఐనప్పటికీ కొందరు రోగులకు కాలనుగతంగా మసక చూపు రావచ్చని అన్నారు. దీనిని అనుషంగిక సుక్లం అని అన్నారు.ఈ స్థితికి సాధారణ లేజర్ ప్రక్రియతో చికిత్స చేయ వచ్చని తెలిపారు.చాలా మంది శుక్లా న్ని తొలగించటానికి అది పూర్తిగా ముదరాలని నమ్ము తారని కానీ నిజం కాదన్నారు. శుక్ల శస్త్ర చికిత్స సురక్షితమైనది అన్నారు.

Before The Honourable Deputy Registrar Of Chits at Nellore

(Application for reference of a Dispute)

Dispute No. 231 of 2020

M/s. Sri Sai Anjana Chit Funds India. Pvt., Ltd., Buchireddypalem Branch, SPSR Nellore District. Rep.by its Legal Officer, **Shaik Alli Babu,** Being authorized person ... Disputant.

Versus

1. **Baditha Ramana** and 5 Others ... Opponents.

Notice

To,

Opp-1. **Baditha Ramana,** S/o **Audi Narayana,** Occ: Business, R/o D.No: 20-6-82/B12, Ground floor, 3rd line, Ramalingeswara Pet, Vijayawada, Krishna District.

Opp-3. **Chintapalli Gandhi,** S/o **Nageswara Rao,** Occ: Employee. R/o. D.No: 4-38, Adhiyaa Street, PC 22, ONI Pet, Vijayawada. Krishna District.

Opp-4. **Vemavarapu Prabhakar Rao,** S/o **Uma Maheswara Rao,** Occ: Employee. R/o. D.No: 76-53-115/3, OCD H.B Colony, Bhavani Puram, Vijayawada. Krishna District.

Opp-6.**Baditha Padma,** W/o **Baditha Ramana,** R/o D.No: 20-6-82/B12, Ground floor, 3rd line, Ramalingeswara Pet, Vijayawada, Krishna District.

పై నెంబరు డిస్ప్యూటులో మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు లో మీకు నోటీసునిమిత్తం **తే16-06-2023దికి** వాయిదా వేసియు న్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగాని లేదా వకీలు ద్వారాగాని పైన తెలిపిన డిప్యూటీ రిజి స్ట్రార్ ఆఫీటీల్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై అక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జలదంకి సురేష్ బాబు, బి.కాం., ఎల్.ఎల్.బి.,
డిస్ప్యూటెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

గ్రామపంచాయతీ కార్యాలయం, గొట్టుముక్కల

బహిరంగ వేలం ప్రకటన

ఆర్ఓ.సి. నెం.05/2023 తేది : **12-6-2023**

ఎన్.టి.ఆర్.జిల్లా, కంచికచర్ల మండలం, గొట్టుముక్కల గ్రామపంచాయతీ పరిధిలో గల అబ్బూరాజు చేపల చెరువు 1432 అండ్ 1433 పసలీ (1-7-2022 నుండి 30-6-2024 వరకు) లీజు హక్కులు ఇచ్చుటకు 15-6-2023వ తేదీన ఉదయం 10-00 గం.లకు గ్రామపంచాయతీ కార్యాలయం నందు శ్రీయుత విస్తరణాధికారి (పిఆర్ అండ్ ఆర్‌డి) మండల ప్రజాపరిషత్, కంచికచర్ల వారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు వేలం నందు పాల్గొనువారు ధరావత్తు చెల్లించవలెను. వేలం షరతులు పంచాయతీ కార్యాలయం పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

సం॥ తల్లిమిల్లి రాజ్‌కుమార్,
సర్పంచ్,
గొట్టుముక్కల గ్రామపంచాయతీ

సం॥ వి.సుబ్రహ్మణ్యం
పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, గొట్టుముక్కల

నగర పాలక సంస్థ కౌన్సిల్ రద్దుకు డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను అమలు చేయని మచిలీపట్నం నగర పాలక మున్సిపల్ కౌన్సిల్‌ని వెంటనే రద్దు చేయాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేయని మచిలీపట్నం నగరపాలక కార్పోరేషన్ ప్రజా సమస్యలను పట్టించుకుంటుందా? అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పోరేషన్ యాక్ట్ 679 (డి) ప్రకారం మచిలీపట్నం నగరపాలక కార్పోరేషన్ కౌన్సిల్ రద్దు చేయాలని కోరారు. మచిలీపట్నం అభివృద్ధికి కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం మచిలీపట్నం ప్రజల చిరకాల వాంఛ అయినందున సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టాభి స్మారక భవనం కోసం జిల్లా కోర్టు సెంటర్‌లో రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వపరంగా కేటాయిస్తూ గతేడాది ఏప్రిల్ 25న ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఏడాదైనా నగరపాలక కార్పోరేషన్ వారు అనుమతులు ఇవ్వకపోవడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. సదరు పట్టాభి స్మారక భవనం నిర్మాణం విషయంపై పలుమార్లు అఖిలపక్షం నాయకులు, పట్టణ ప్రముఖులు జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోకుండా బుట్ట దాఖలు చేయడం దుర్మార్గపూరితమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, బిజెపి మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి సోడిశెట్టి బాలాజీరావు, మచిలీపట్నం న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్, బిజెపి జిల్లా నాయకుడు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు వేమూరి రామకృష్ణారావు, ఏ ఆర్ కె మూర్తి, పి.వి. ఫణి కుమార్, మోపర్తి సుబ్రమణ్యం, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ, సూరిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.

విశ్వాస ఘాతకుడు వంశీ

జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

విశ్వాసం లేని ఘాతుకుడు వల్లభనేని వంశీ అని కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు విమర్శించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సార్లు వంశీ గెలిచారంటే అది చంద్రబాబు నాయుడు పెట్టిన భిక్ష అని పేర్కొన్నారు. ఈ సారి గన్నవరంలో వంశీకి ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందన్నారు. ఈ విషయాన్ని వైసిపి నేతలు చేపించిన సర్వేల ద్వారా తెలుకున్న జగన్ రానున్న ఎన్నికల్లో గన్నవరం సీటు తనకి ఇవ్వరని ముందుగానే గ్రహించి టీడీపీ అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు ,విమర్శలు చేస్తే సీటు ఇస్తారనే దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారన్నారు. పేదలకి ఇచ్చే సెంటు భూమి ఎటు సరిపోకుండా ఉంటుందని 2 సెంట్లు ఇస్తే చక్కని ఇల్లు ఇంటిముందు పాడి గేదె పెట్టుకొని పేదవాడు అభివృద్ధి చెందుతారని ఒక్క ఆలోచన ఈ వైసీపీ నాయకులకు ఇస్తే దాన్ని కూడా విమర్శించడం సిగ్గు చేటన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గాని ఇటు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కూడా 2 సెంట్లభూమికి తగ్గకుండా పేదవారికి ఇచ్చారని ఈ సందర్భంగా అయన గుర్తు చేశారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. అవనిగడ్డ మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కి ట్లు పంపిణీ చేశారు.

సోమవారం పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు జగనన్న కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, ఎంపీటీసీ సభ్యురాలు అవనిగడ్డ స్వర్ణకుమారి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, అవనిగడ్డ ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, వార్డు సభ్యులు పడమటి రాజ్యలక్ష్మి, ఎంఈఓ ఎన్ శివశంకరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సిఎం చర్యలు

ఘంటసాల : విద్యాభివద్ధికి సీఎం జగన్మోహన్ రెడ్డి బాటలు వేస్తున్నారని ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం నుంచి పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా ఘంటసాలలోని మహాత్మా గాంధీ జడ్పీ హైస్కూల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ఏఎంసి చైర్మన్ వెంకట్రావు, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో కేవి. సుబ్బారావు తహసీల్దార్ బి.రామానాయక్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎంసి దోనేపూడి లక్ష్మినాగశ్రీ , పాఠశాల హెచ్ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కోర్టు ఆదేశాలను దిక్కరించి మతదేహాన్ని ఖననం చేసిన వారిపై చర్యలు తీసుకొవాలని బంటుమిల్లి మండలం, ములపర్రు గ్రామ సర్పంచ్ బొడ్డు మంగమ్మ సోమవారం బందరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్ కు స్పందనలో వినతి పత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 50 సెంట్ల పుంత పోరంబోకు స్థలం ఉందని సదరు స్థలము స్థానికేతరు దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నించగా తాము, గ్రామస్తులం అడ్డుకున్నామని పేర్కొన్నారు. అయినప్పటికి అధికారుల సహకారంతో వారు దౌర్జన్యంగా మట్టితోలి, ఫెన్సింగ్ వేశారని. దీనిపై 2021 డిసెంబర్ 6 వ తేదీన పంచాయితీ పాలకవర్గం తీర్మానం చేసి సదరు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ విషయంపై 2022 ఫిబ్రవరి 28వ తేదీన గ్రామస్తులు సంఘటితంగా సంతకాలు చేసి జిల్లా కలెక్టరు వారికి స్పందనలో అర్జీ సమర్పించామన్నారు. అయినప్పటికి పాలక వర్గ తీర్మానం మేరకు తమ భూమికి తగిన రక్షణ ఇప్పించి న్యాయం చేలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో కోర్టువారు ఈ ఏడాది మార్చి 9 న 6000/2028 నెం ఆర్డరు ఇచ్చారన్నారు. అయిన జానకీరామపురం గ్రామస్తులు కొందరు రాజకీయ పలుకుబడితో మా పంచాయతీ తీర్మానాలను దిక్కరించి రెవెన్యూవారిని లోబరుచుకుని కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో ఈ నెల 8 తేదీన క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతిలో ఖననం చేసేందుకు ప్రయత్నించారు. దీనిని తాము ము అభ్యంతరం వ్యక్తం చేస్తూ తాహసీల్దార్ కు ఫిర్యాదు చేశామన్నారు. తాహసీల్దార్ స్పందించలేదన్నారు.కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో దౌర్జన్యంగా మతదేహాన్ని ఖననం చేసిన వారిపైన ఫిర్యాదు చేసిన స్పందించని రెవెన్యూ అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేసి ములపర్రు రెవెన్యూ పరిధిలోని ఆస్తికి రక్షణ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు గౌరి శెట్టి నాగేశ్వరరావు,ఎల్ అజయ్ గోష్,పంచాయతీ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మత్స్యకారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్లో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సంప్రదాయ మత్స్యకారులకు అందటం లేదని అవి అందేలా చర్యలు తీసుకోవాలని ఎపి సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019-20లో ప్రధాన మంత్రి అట్టహాసంగా ప్రారంభించిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం పథకాలు సైతం రాష్ట్రంలోని మత్స్యకారులకు అందడం లేదని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సముద్రంలో వేట నిషేధిత జీవన భృతి, సబ్సిడీ డీజిల్ ఆయిల్ పథకాలను అరాకొరగా అమలు చేయడం మినహా కొత్తగా ఏ ఒక్క పథకం అమలు చేయకపోవడంతో మత్స్యకారులు ఆర్థిక పురోగతి సాధించలేక అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. గత తొమ్మిదేళ్ల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు మత్స్యకారుల ప్రగతిపై అధ్యయనం చేయాలన్నారు. వివిధ రకాల నిపుణుల మత్స్యకార సంఘాల ప్రతినిధులతో కమిటీ వేసి అధ్యయనం చేసి కమిటీ సిఫారసుల మేరకు సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయాలని నాగాంజనేయులు ప్రభుత్వాలను కోరారు

45 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఏజీఅంన్ఎస్ డిగ్రీకళాశాల ఉపాధి శిక్షణావిభాగం, దివీస్ లేబరేటరీస్ సంయుక్త ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 45 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు కళాశాలల నుండి 128 మంది విద్యార్థులు హాజరు కాగా వివిధ దశల్లో ఎంపిక జరిగింది. దివీస్ సంస్థ హెచ్ఆర్ ఆర్.రామకృష్ణ, నవీన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ఉపాధి శిక్షణా విభాగం అధికారి టి.నాగప్రసాద్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సి పాల్ వి.శ్రీరామ్ అభినందించారు.

చెరకు రైతులకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి-ఉయ్యూరు

కేసీపీ కర్మాగారం పరిధిలోని చెరుకు రైతులకు రాష్ట్ర ఉత్తమ రైతు పురస్కారం లభించింది. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేసీపీ కర్మాగార పరిధిలో అత్యధికంగా చెరుకు పండించిన రైతులు పురస్కారాలు అందుకున్నారు. ఘంటశాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన వేమూరి రత్నగిరిరావు 2020-2021 సీజను ఎకరాకు 79.5 మెట్రిక్ టన్నులు, తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన జంగా పిచ్చిరెడ్డి 2021-2022 సీజన్‌కు ఎకరాకు 80.5 మెట్రిక్ టన్నులు చెరుకు పండించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ద్వారా ప్రశంసా పత్రం, బంగారు పతకాలు అందుకున్నారు. కేసీపీ కర్మాగారానికి సేంద్రియ వ్యవసాయంలో పురస్కారం లభించింది. ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్న రైతులను కర్మాగార యూనిట్ హెడ్ వై.సీ తారామదాస్, జీఎం కేన్ వీవీ పున్నారావు, డీజీఎం కేన్ ఆర్. సూర్యారావు అభినందించారు.

మహిళా హోంగార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

జిల్లా హోంగార్డు విభాగంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మహిళ హోంగార్డు కె.కమలకు జిల్లాలోని హోంగార్డులు అంతా కలిసి సేకరించిన ఒక రోజు వేతనం రూ 3,94,050 చెక్కును జిల్లా ఎస్పీ పి జాషువా సోమవారం తన కార్యాలయంలో కమలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అంతర్భాగమైన హోంగార్డు విభాగంలో సుదీర్ఘ కాలం పాటు తన విశిష్ట సేవలను అందించినందుకు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. పదవి విరమణ పొందిన హెూంగార్డు సిబ్బందికి పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శాఖా పరంగా ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చిన ధైర్యంగా తనను కలవ వచ్చని తెలిపారు. అలాగే పదవి విరమణ పొందిన సిబ్బంది తమ శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

విజయవాడలో దక్షిణ్ వీవ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మొగల్రాజపురంలోని పివిపి రోడ్డులో దక్షిణ్ వీవ్స్ పేరుతో సరికొత్త హ్యాండ్లూమ్స్ షోరూమ్‌ను సోమవారం ఉదయం కంకటాల ఛైర్మన్ కంకటాల మల్లిఖార్జునరావు, సిఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ మావూరి వెంకట రమణ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత రంగంలో దక్షిణ్ వీవ్స్ ఒక కొత్త నాంది అని అన్నారు. ఎంతో మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. ఫ్యాషన్ రిటెయిలింగ్ ప్రపంచంలో షాప్ ఇన్ షాప్ మోడల్‌ను ప్రవేశపెడుతున్న తొలి బ్రాండ్‌గా దక్షిణ్ వీవ్స్ నిలుస్తుందన్నారు. కొత్తదనంతో, సాటిలేని డిజైనింగ్ కలెక్షన్స్‌తో వినూత్న ఆలోచనల సమ్మేళనంగా రూపొందించారని తెలిపారు. ఇక్కడ అన్ని కలెక్షన్స్ నూటికి నూరుశాతం సహజ సిద్ధమైన కాటన్, సిల్క్స్, లెనిన్, ఖాదీ, జూట్‌లతో నేసినవేనన్నారు. హోమ్‌వేర్, సీజనల్ కలెక్షన్స్, వర్క్ వేర్, టెంపుల్ కలెక్షన్స్, హాలిడే కలెక్షన్స్, ఫెస్టివ్ కలెక్షన్స్‌ను ప్రత్యేకంగా ఆవిష్కరించినట్లు తెలిపారు. కెవిఎస్ఆర్ హ్యాండ్లూమ్ సంస్థ ఎండీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా వస్త్ర తయారీ ప్రపంచంలో ఉన్నామని తెలిపారు. స్వచ్ఛతకు, సహజత్వానికి ప్రతిరూపంగా అసలైన నిర్వచనంగా తమ బ్రాండ్ ఉంటుందన్నారు. మన సాంస్కృతిక వారసత్వం నుండి అలవాట్ల నుండి రోజువారి జీవితాన్నుంచి , సంప్రదాయాల నుండి స్ఫూర్తి పొంది వీటిని రూపొందించినట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలోని 25 ప్రాంతాలలో షాప్ ఇన్ స్టోర్ కాన్సెప్టును విస్తరించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు అవార్డు

ప్రజాశక్తి-భవానీపురం: గిరిజనుల జీవితాలపై అనేక చిత్రాలను చిత్రీకరిస్తున్న విజయవాడ భవానీపురంకు చెందిన 'గిరిజన గీతశిల్పి' బొండా జగన్మోహనరావుకు ప్రతిష్టాత్మక డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ వారి రబీ సమ్మాన్ అవుట్ స్టాండింగ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ గిరిజనుల జీవన విధానంను పరిచయం చేస్తూ తాను గీసిన వందలాది చిత్రాలకు ప్రముఖ సంస్థలు అవార్డులు ఇవ్వడం సంతోషంగా వుందన్నారు. వివిధ సామాజిక అంశాలపై

తాను గీసిన చిత్రాలకు గాను ఇప్పటి వరకూ తనకు నూట యాభైకి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయని చెప్పారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా కాకుండా సమాజంలోని అన్ని కోణాలను సృజిస్తూ సామాజిక బాధ్యతతో చిత్రకారులు చిత్రాలు గీయాలని ఆయన సూచించారు.

వారాహి యాత్ర విజయవంతం కావాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ ఆధ్వర్యంలో సోమవారం దుర్గగుడి టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు

నిర్వహించి అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం వారాహి యాత్రకి సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శైవ క్షేత్రం నుంచి స్వామీజీలు హనుమత్ స్వామి. ఆత్మానంద స్వామి. సాయి సత్యానంద యోగి స్వామీజీ, డివిజన్ అధ్యక్షులు పోట్నూరి శ్రీనివాసరావు, కొరగంజి వెంకటరమణ, మల్లేపు విజయలక్ష్మి, తిరుపతి అనూష బొమ్ము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో కార్మిక, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, వాసవ్య మహిళ మండలి, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో బాలకార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి ఇప్పటి వరకు 23 కేసులను నమోదు చేశారన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున బడిఈడు పిల్లలు ప్రతీ ఒక్కరూ బడిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను సమూలంగా రూపుమాప గలుగుతామన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బాల్యం... బడికి అనే అవగాహన కల్పించే పోస్టర్‌ను, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఏర్పడి నేటికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోగో పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ యం. శ్రీమన్నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, డియంహెచ్‌వో డా. యం.సుహాసిని, దిశ స్టేషన్ ఆఫీసర్ కె.వాసవి, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ కె.సువార్త, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వి. విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే ని పకడ్బంధీగా నిర్వహించాలి

ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ దోమల నివారణ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోమల నివారణ కార్యక్రమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రానున్న నాలుగు నెలలపాటు వర్షాకాలం అయినందున జనావాసాల మధ్య నీటి నిల్వలు, నీటి మడుగులు ఏర్పడే అవకాశం ఉందని, ఉపయోగించని నీరు వారం రోజులు నిల్వ ఉన్నట్లైయితే ఆ ప్రాంతంలో లార్వా ఆవాసం ఏర్పాటు చేసుకుని దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఉపయోగించని పాత్రలు, కొబ్బరి బొండాలు, చెక్కలు, ఉపయోగించని టైర్లలో నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్‌కుమార్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, జిల్లా అధనపు వైద్య ఆరోగ్య శాఖాధికారిని డా. ఉషారాణి, జిల్లా మలేరియా ఆఫీసర్ డా. వి.మోతీబాబు, ఏయంవో డి. సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రతి కూడలిని సుందరంగా తీర్చిదిద్దాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలోని ప్రతి కూడలిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రజారోగ్య విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని 10, 11 వార్డుల్లోని పటమట కూడలి, పంటకాలువ రోడ్డు, కరణం గారి బజార్, కాకతీయ రోడ్డు, ఫన్ టైం రోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం కమిషనర్ పరిశీలించారు. పటమట కూడలి, పంటకాలువ రోడ్డులో సిబ్బంది ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వీకరించాలని ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో ప్రజలు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలన్నారు. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చిన్న, పెద్ద డ్రెయిన్ల కాలువల్లో పూడికను తొలగించేలా చర్యలు చేపట్టామన్నారు.

అంబేద్కర్ స్మృతివనం పనుల పరిశీలన

అత్యంత వేగంగా అంబేద్కర్ స్మృతివనం నిర్మాణం పనులు జరుగుతున్నాయనికమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం పలువురు అధికారులతో కలిసి స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే 74 అడుగుల ఎత్తు వరకు విగ్రహ నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నార్నారు.



వెంకటేశ్వరుడిని దర్శించుకున్న హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి-వన్‌టౌన్

స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలకమండలి కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. దేవస్థానంలో ఎన్నో సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న సీనియర్ ఉద్యోగస్తులకు ప్రిన్సిపల్ హోం సెక్రటరీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

విజయవాడ ప్రింటర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి: విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రింటింగ్ ప్రెస్‌లను ఆదుకోవాలని విజయవాడ ప్రింటర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు సోమవారం అసోసియేషన్ అధ్యక్షులు బిటి మల్లేశ్వరరావు, కార్యదర్శి వెలగా శ్రీనివాస్, కోశాధికారి బి వెంకటరమణ సిపిడిసిఎల్ ఎండిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ట్రూఅప్ చార్జీలు, స్థిర చార్జీలు, విద్యుత్ సుంకం నిలుపుదల చేయాలని కోరారు. గత కొన్నేళ్లుగా కరెంట్ చార్జీలు పెరుగుతుండటంతో ప్రింటింగ్ ప్రెస్‌లు నడపలేక అనేక మంది ఈ రంగాన్ని వదిలేసి వెళ్లిపోతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక సతమత మవుతున్నార్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రతి నెలా భారాన్ని మోపుతున్నారని పేర్కొన్నారు. భారంగా మారిన స్థిర చార్జీలు, విద్యుత్ సుంకం, ట్రూఅప్ చార్జీలను ఎత్తివేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి-వన్‌టౌన్: బాలబాలికలకు విద్య కానుక కిట్లను స్థానిక 37వ డివిజన్ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో గల 66 స్కూల్స్‌లో చదువుకునే 11,242 మంది బాల బాలికలకు కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ళ విద్యాధరరావు, స్కూల్ ప్రిన్సిపల్ పి. నీరజ, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భవానీపురం 40వ డివిజన్‌లోని ఎస్ఎంఎ ఖుద్దూస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, శ్రీ కనమర్లపూడి సుబ్బారావు మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్లో విద్యా కానుక కిట్లను కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎంలు ఉమర్ అలీ, కెవివి ఉషారాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ:** విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో 496 మంది విద్యార్థులకు సోమవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సూర్యప్రభ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.